

దోషులను ఉరి తీయాలి

విధి నిర్వహణలో ఉన్న వైద్యురాలిపై అత్యాచారం చేసి, హత్యకు పాల్పడిన దోషులను బహిరంగంగా ఉరి తీయాలి. రాత్రి సమయంలో ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తున్న మహిళా డాక్టర్ రక్షణ లేకుండా పోవడం దారుణం. భవిష్యత్తులో ఈ విధమైన దుర్మార్గపు చర్యలకు ఎవరూ పాల్పడకుండా ఉండేలా చట్టాలు తీసుకురావాలి.

- డాక్టర్ చందన, లాస్కిన్ 360 హాస్పిటల్, రాజమహేంద్రవరం



కఠినంగా శిక్షించాలి

కోల్‌కతా వైద్యురాలిని హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలి. సభ్య సమాజం తలదించుకునేలా ఈ ఘటన జరిగింది. మహిళలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వం స్పందించి మహిళా వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి.

- డాక్టర్ కె.స్పందన, రాజమహేంద్రవరం



అధ్వానంగా హండ్రెడ్ ఫీట్ రోడ్డు

- డంపింగ్‌యార్డులా రహదారి
- వాహనచోదకులు, వాకర్ల అవస్థలు

రాజమహేంద్రవరం రూరల్: రహదారులను ప్రగతికి చిహ్నాలుగా భావిస్తారు. రోడ్డు సౌకర్యం బాగా ఉన్న ప్రాంతాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతాయి. ప్రజల అవసరాలను అనుగుణంగా నిర్మించిన రోడ్లను అందరూ కాపాడుకోవాలి. లేకపోతే అభివృద్ధి కుంటుపడుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాజమహేంద్రవరంలోకి వెళ్లేందుకు జాతీయ రహదారి సమీపంలో పిడింగొయ్యి జైహింద్ నగర్ నుంచి ఆవ వాంబే కాలనీ హండ్రెడ్ ఫీట్ రోడ్డు నిర్మించారు. ఎంతో అందంగా ఉండే ఈ రోడ్డు ఇప్పుడు అధ్వానంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా భవనాల వ్యర్థాలు, చెత్తను వేస్తుండడమే దీనికి కారణం. ఈ రోడ్డుపై ప్రయాణించడానికి వాహన చోదకులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పచ్చదనం కోసం రోడ్డు మధ్య డివైడర్‌లో వేసిన ఖర్జూరపు మొక్కలు కూడా ఎండిపోతున్నాయి.

మాజీ ఎంపీ భరత్‌రామ్ చొరవతో..

రాజమహేంద్రవరం నగరంలోకి వెళ్లడానికి ప్రజలు పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను పరిష్కరించడంలో భాగంగా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ చొరవతో హండ్రెడ్ ఫీట్ రోడ్డును ఏర్పాటు చేశారు. దీనితో పాటు డ్రైనేజీ నిర్మాణం కూడా చేపట్టారు. రోడ్డు ఆహ్లాదకరంగా ఉండేందుకు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేసి వాటి మధ్యలో సుమారు 10 అడుగుల ఖర్జూరపు మొక్కలను సైతం నాటారు.



డంపింగ్‌యార్డులా మారిన హండ్రెడ్ ఫీట్ రోడ్డు

డంపింగ్ యార్డు

హండ్రెడ్ ఫీట్ రోడ్డు ప్రస్తుతం డంపింగ్ యార్డుగా మారింది. భవన నిర్మాణాలు చేపట్టేవారు తమ బిల్డింగ్ వ్యర్థాలను తీసుకువచ్చి హండ్రెడ్ ఫీట్ రోడ్డులో పారబోస్తున్నారు. దాని చూసిన మరికొందరు తమ ఇంటిలోని చెత్తను తీసుకువచ్చి ఇక్కడే వేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతమంతా డంపింగ్ యార్డులా మారిపోతోంది. రాత్రి సమయంలో ఈ చెత్తా చెదారాలను వేయడం వల్ల అధికారులు సైతం ఆపలేకపోతున్నారు.

అవగాహన లేదా..

అందమైన రోడ్డుపై చెత్త వేయకూడదన్న అవగాహన లేని కొందరు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారు. ప్రజల్లో చైతన్యం వస్తేనే ఇటువంటి వాటికి చెక్ పెట్టవచ్చు. నగరపాలకసంస్థ అధికారులు జేసీబీలతో చెత్తను పక్కకు తోయించాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో నగరపాలకసంస్థ అధికారులు గస్తీ ఏర్పాటు చేసి చెత్త పోసే వ్యక్తులపై కేసులు నమోదు చేసి భారీగా జరిమానాలు విధిస్తే తప్ప హండ్రెడ్ ఫీట్ రోడ్డుకు మోక్షం లభించదు.

ఎండిపోతున్న మొక్కలు

హండ్రెడ్ ఫీట్ రోడ్డు డివైడర్ మధ్యలో వేసిన ఖర్జూరపు మొక్కలు ఎండిపోతున్నాయి. ఆ రోడ్డులో వేసిన మొక్కల్లో 30 శాతానికి పైగా ఎండిపోయాయి. నగరపాలకసంస్థ పరిధిలో ఉద్యానశాఖ అధికారులు మొక్కలు విషయంతో జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డివైడర్ మధ్యలో ఎండిపోతున్న మొక్కలు

విద్యార్థులకు పోటీలు

కంబాలచెరువు: మాతృభాష గొప్పతనంపై నగరంలోని ఇంటర్, డిగ్రీ, పీజీ, కళాశాలల విద్యార్థులకు శుక్రవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఆదిత్య కళాశాలల కల్చరల్ కో ఆర్డినేటర్ డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి మాట్లాడుతూ శనివారం తెలుగు భాష, దేశభక్తి గీతాల మీద పాటల పోటీ, ఏకపాత్రాభినయం, తెలుగు కవులు, సాహిత్యం, రచనల మీద క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ ఏటా తెలుగు భాషా దినోత్సవం నిర్వహించి, వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ ప్రకటించారు. శనివారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకూ శాస్త్రిగారి వీధి, ధనలక్ష్మి వీధి, ప్రకాశం నగర్ రౌండ్ పార్క్, గాంధీపురం - 2, గాంధీపురం - 3, లైఫ్ మెడికల్స్ , ముగ్ధ షాపింగ్ మాల్ ఏరియా, శ్యామల నగర్, పంచవటి, జాగృతి బ్లడ్ బ్యాంక్, ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ ఏరియా, శ్యామలా నగర్ రామాలయం సెంటర్లలో విద్యుత్ ఉండదన్నారు.

క్లుప్తంగా

ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన శిక్షణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులుగా ట్రైనింగ్ ఆన్ ట్రైనర్స్ ప్రోగ్రాం, బ్యాంకింగ్ ఫైనాన్స్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ స్కిల్ సెక్టార్ కౌన్సిల్, క్రిస్ప్వేప్ ఆధ్వర్యంలో జరుగుతున్న మూడు రోజుల శిక్షణ శుక్రవారం ముగిసింది. అక్కౌంటింగ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్ నైపుణ్యాలను పెంపొందించుకోవడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కళాశాలల నుంచి వచ్చిన ట్రైనర్లకు ఇచ్చారు. బీకామ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు పొందడానికి ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మాస్టర్ ట్రైనర్ చక్కర రాఘవ్ మాట్లాడుతూ అక్కౌంటింగ్ అసిస్టెంట్, ట్యాక్స్ అసిస్టెంట్లకు కావాల్సిన నైపుణ్యాలన్నింటినీ చర్చించారు.

తపాలా స్టాంపుల సేకరణకు కేంద్ర ప్రోత్సాహం

రాజమహేంద్రవరం సిటీ: తపాలా స్టాంపుల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ స్పర్శ్ పథకం ఏర్పాటు చేసిందని రాజమహేంద్రవరం పోస్టల్ సూపరింటెండెంట్ కోట శేషారావు తెలిపారు. తపాలా స్టాంపులను సేకరించే విద్యార్థులకు ఈ పథకంలో ఉపకార వేతనాలు మంజూరు చేస్తారన్నారు. చదువు ప్రతిభ కనబరుస్తూ స్టాంపులు సేకరించే 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు నెలకు రూ.500 చొప్పున ఏడాదికి రూ.6 వేలు అందజేయనున్నారు. విద్యార్థులు చదివే పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ ఏర్పాటై ఉండి, దానిలో అతడు సభ్యుడై ఉండాలన్నారు. పాఠశాలలో ఫిలాటలీ క్లబ్ లేని పక్షంలో వ్యక్తిగతంగా ఫిలాటలీ సభ్యుడై ఉండాలన్నారు. సమీపంలోని తపాల కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయని, వాటిని పూర్తిచేసి పోస్ట్‌మాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్, విశాఖపట్నం-530017 చిరునామాకు స్పీడ్ పోస్ట్ ద్వారా సెప్టెంబర్ 16వ తేదీలోగా పంపాలని కోరారు.

కొనసాగిన ఉపాధ్యాయుల సర్దుబాటు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ మండల ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు కౌన్సెలింగ్ స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగింది. డీవైఈవో నారాయణ, అర్బన్ ఎంఈవో బి.దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల సబ్జెక్టులకు అర్హత గల సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయించారు. తెలుగు 3, హిందీ 3, ఇంగ్లిష్ 8, గణితం 10, భౌతిక శాస్త్రం 9, జీవశాస్త్రం 12, సాంఘిక శాస్త్రం 20 సబ్జెక్టులకు సర్దుబాటు చేశారు. ఉన్నత పాఠశాలలలోని మొత్తం 65 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో దిలీప్ కుమార్ మాట్లాడుతూ అర్బన్ పరిధిలో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో కౌన్సెలింగ్ నిర్వహించామని, మిగిలిన పోస్టులకు విద్యాశాఖ ఉన్నత అధికారుల తదుపరి ఆదేశాలను అనుగుణంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.రవిబాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సీనియారిటీ విషయంలో సాంకేతిక సమస్య వల్ల కౌన్సెలింగ్ ఆగిపోయిందన్నారు.

రెండు నెలలుగా వెలగని వీధి దీపాలు



రత్నంపేట వాంబే గృహాలకు వెళ్లే రోడ్డులో నెలకొన్న అంధకారం

రాజమహేంద్రవరం సిటీ: వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. వివరాల్లోకి వెళ్లితే.. 42వ డివిజన్ రత్నంపేట వాంబే గృహాలకు వెళ్లే దారిలో గత రెండు నెలలుగా విద్యుత్ దీపాలు వెలగడం లేదు. చీకటి పడితే చాలు పాములు తిరుగుతున్నాయని, ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాకపోకలు చేస్తున్నామని స్థానికులు చెబుతున్నారు. ఈ సమస్యపై 45వ వార్డు సచివాలయం అడ్మిన్ సెక్రటరీకి ఫిర్యాదు చేసిన ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇక్కడ నివసించే వారందరూ దాదాపు పేదలే. చీకటి పడితే చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయాందోళనకు గురవుతున్నారు.

సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామాలలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహించినట్టు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. పిడింగొయ్యి గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ గ్రామ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మహాత్మాగాంధీ, టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచినీటి వ్యవస్థతో పాటు, శానిటేషన్ తదితర అంశాలపైనా దృష్టి సారించామన్నారు. ఇన్‌చార్జి డ్వామా పీడీ శ్రీరాములు నాయుడు, మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డీఈ సూర్యనారాయణ, ఏఈ సంపత్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రూప్‌చంద్ పాల్గొన్నారు. హుకుంపేట, బొమ్మూరు, రాజవోలు, కోలమూరు, శాటిలైట్‌సిటీ, కాతేరు, తొర్రేడు, వెంకటనగరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

కడియం: మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లోనూ శుక్రవారం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామసభలను నిర్వహించారు. మండల స్థాయి అధికారులు నోడల్ ఆఫీసర్లుగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాల్లో ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించారు. అలాగే పథకం లక్ష్యం, గ్రామంలో ప్రతిపాదించిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను తెలియజేశారు. వేమగిరి పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభకు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, ఎంపీడీవో కె.రత్నకుమారి తదితరులు హాజరయ్యారు. అలాగే జేగురుపాడులో సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, కడియపులంకలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, దామిరెడ్డిపల్లిలో ఉపసర్పంచ్ ముద్రగడ జెమి, కడియపుసావరం సర్పంచ్ చక్కపల్లి మురళీ సభలకు అధ్యక్షత వహించారు.



పిడింగొయ్యిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి



జేగురుపాడులో మాట్లాడుతున్న సర్పంచ్ సతీష్‌చంద్ర స్టాలిన్

పాత పైప్‌లైన్లను మార్చాలి

ధవళేశ్వరం: ధవళేశ్వరం గ్రామంలో 33 ఏళ్ల క్రితం వేసిన పాత మంచినీటి పైప్‌లైన్లను మార్చాలని దిఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ యర్రమోతు ధర్మరాజు సూచించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి సభను గ్రామ ప్రత్యేక అధికారి దారపురెడ్డి బాలశంకరరావు అధ్యక్షతన నిర్వహించారు. మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబు గ్రామ అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. తహసీల్దార్ టి.రమ్య, గ్రామ కార్యదర్శి డి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

కడియం: స్థానిక హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ తన తల్లి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ బాలికల వసతి గృహంలోని 16 మందికి ఒకొక్కరికి రూ.300 విలువ చేసే నిత్యావసరాలు అందించారు. ఇంటర్ ఫస్టియర్ బైపీసీలో 417 మార్కులు సాధించిన జ్యోతుల మహేశ్వరి, 414 మార్కులు సాధించిన సత్యవాడ ఝాన్సీలకు ఒకొక్కరికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. గర్ల్ చైల్డ్ అంశంపై చిత్రలేఖనం పోటీల్లో విజేతలుగా నిలిచిన 15 మంది బాలికలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. జూనియర్ రెడ్‌క్రాస్ నిధికి రూ.500 ఇచ్చారు. హైస్కూల్ హెచ్‌ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

ప్రియదర్శిని ఆశ్రమంలో వైద్య శిబిరం

కంబాలచెరువు: స్థానిక మున్సిపల్ కాలనీలోని ప్రియదర్శిని ఆశ్రమంలో విద్యార్థులకు కిమ్స్ బొల్లినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వి.రవిమోహన్ ఆశ్రమంలోని 150 మంది విద్యార్థులను పరీక్షించి, జ్వరం, రొంప, దగ్గు, ఇతర సమస్యలున్న వారికి అవసరమైన మందులను అందించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకురాలు కె.స్వప్నవర్మ మాట్లాడుతూ కొద్దిరోజులుగా వాతావరణ మార్పుల్లో భాగంగా వైరల్ ఫీవర్లు, రొంప, దగ్గు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా తమ ఆశ్రమంలో విద్యార్థులకు వైద్య సేవలు అందించాల్సిందిగా కిమ్స్ బొల్లినేని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావును కోరినట్టు తెలిపారు. ఆయన వెంటనే స్పందించి తమ పిల్లలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారన్నారు. శిబిరంలో మార్కెటింగ్ స్టాఫ్ నాగేంద్ర, విజయ్‌కుమార్, వంశీ, ఉదయ్‌కుమార్, ఆశ్రమ ప్రత్యేక ఉపాధ్యాయులు ప్రేమలత, నిర్మల, శాంతి, సునీత, ప్రియాంక పాల్గొన్నారు.



ప్రియదర్శిని ఆశ్రమంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవిమోహన్

అంత్యానుప్రాస నిఘంటువు ఆవిష్కరణ

రాజమహేంద్రవరం సిటీ: మాతృభాషలో డాక్టర్ అరిపిరాల నారాయణరావు రూపొందించిన అంత్యానుప్రాస నిఘంటువు అందరికీ ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ప్రకాశం నగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాల్లో శుక్రవారం అంత్యానుప్రాస నిఘంటువును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ అంత్యానుప్రాస పదాలు (రైమింగ్ వర్డ్స్) తెలుగు భాషకు వన్నెలద్దుతాయన్నారు. డాక్టర్ అరిపిరాల నారాయణరావు ఐదేళ్ల నుంచి ఎంతో శ్రమించి సుమారు 50 వేల పదాలతో అంత్యానుప్రాస నిఘంటువు రూపొందించడం అద్భుతమైన విషయమన్నారు. మొట్టమొదటి అంత్యానుప్రాస నిఘంటువు డాక్టర్ అరిపిరాలవారిదే అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, డాక్టర్ కర్రి రామారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ పాల్గొన్నారు.



నిఘంటువును ఆవిష్కరిస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

అంతరిక్ష విజ్ఞానంపై అవగాహన

కంబాలచెరువు: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు 'అంతరిక్ష విజ్ఞానం-ఆవశ్యకత'పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భౌతిక శాస్త్ర అధ్యాపకుడు శ్రీహరి సుధాకర్ మాట్లాడుతూ అంతరిక్ష విజ్ఞానంతో భారత పురోగతిని వివరించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో భౌతిక శాస్త్ర విభాగాధిపతి లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏతో ఉచిత న్యాయసహాయం

కంబాలచెరువు: స్థానిక కేంద్ర కారాగారాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ జైళ్లలో ఉన్న చట్టంతో విభేదించబడిన బాలలను గుర్తించి, న్యాయస్థానాల ముందు వారి బాలత్వాన్ని నిరూపించుకునే అవసరమైన చట్ట సహాయాన్ని అందించే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అర్హులైన వారు న్యాయసేవాధికార సంస్థ నియమించిన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, కారాగార పారాలీగల్ వలంటీర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని న్యాయసహాయం పొందవచ్చన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం కేసుల్లో శిక్షలు తీవ్రంగా ఉంటాయని, బెయిల్ లభించడం కష్టమన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉంటూ పరివర్తన చెంది గౌరవంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జైలు అధికారులు, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



సెంట్రల్ జైలులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాశ్‌బాబు

చెడు వ్యసనాలకు బానిసలు కావొద్దు

రాజానగరం: చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య వై.శ్రీనివాసరావు హితవు పలికారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శుక్రవారం 'ర్యాగింగ్, ఆల్కాహాలిసమ్, డ్రగ్ అబ్యూస్' అనే అంశంపై చైతన్య సదస్సు నిర్వహించారు. తొలుత ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరదాగా ప్రారంభమయ్యే చెడు అలవాట్లు రానురాను జీవితాలను నాశనం చేస్తాయన్నారు. యూనివర్సిటీలో ర్యాగింగ్‌కి తావులేకుండా చక్కటి వాతావరణంతో ఉందన్నారు. దాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ఉన్నత సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన మన దేశంలో ర్యాగింగ్ చట్టాలను తీసుకురావడానికి గల కారణాలను, పరిస్థితులను వివరించారు. న్యూరాలజీ వైద్యనిపుణులు డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ కొందరు యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కావడంతో వారి నూరేళ్ల జీవితాలు మధ్యలోనే ముగిసిపోతున్నాయన్నారు.

టంగుటూరి పోరాటం స్ఫూర్తిదాయకం

- జేసీ చిన్నరాముడు
- ఘనంగా ఆంధ్రకేసరి జయంత్యుత్సవం

సీటీఆర్ఐ: ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాటం స్ఫూర్తిదాయమని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం టంగుటూరి ప్రకాశం జయంత్యుత్సవం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జేసీ, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..

కంబాలచెరువు: బ్రిటిష్ తుపాకీలకు గుండెను ఎదురుగా నిలిపి, ఆంధ్రకేసరిగా బిరుదును అందుకున్న ప్రకాశం పంతులు సాహసం నేటి యువతకు స్ఫూర్తి కావాలని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) రాజశేఖర్ రాజు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో, డీపీవో సిబ్బంది పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో టంగుటూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జేసీ చిన్నరాముడు తదితరులు



ఎస్పీ కార్యాలయంలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ రాజు

డీఎంహెచ్‌వో కార్యాలయంలో..

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం చిత్రపటానికి ఇన్‌చార్జి పరిపాలనాధికారి డా.శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆంధ్ర రాష్ట్రానికి విశేష సేవలు

కంబాలచెరువు: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారని మాజీ కార్పొరేటర్ వర్రె శ్రీనివాసరావు అన్నారు. స్థానిక గాంధీపురం-2 నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. మన రాజమహేంద్రవరంలో 1962లో ఆంధ్ర కేసరి యువజన సమితి ఏర్పడి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఆంధ్ర కేసరి శత జయంతి ఉత్సవ సందర్భంగా జూనియర్ కళాశాలను 1972లో ఏర్పాటు చేశారన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆర్.సన్యాసి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: లారీపై బరకం సరిచేస్తుండగా విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి చెందాడు. హుకుంపేట పాములగుడి సమీపంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుజరాత్‌లోని పరపాంద్రా జిల్లాకు చెందిన తండ్రీకొడుకులు రాథోడ్ రమేష్, రాథోడ్ వీరేష్ (34) లారీలో టైల్స్ తీసుకుని వచ్చారు. హుకుంపేట పాములగుడి సమీపంలోని టైల్స్ గోడౌన్‌లో శుక్రవారం అన్‌లోడ్ చేశారు. అనంతరం లారీపై బరకాన్ని రాథోడ్ వీరేష్ సరిచేస్తుండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి కిందపడ్డాడు. అతడిని వెంటనే చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై మృతుడి తండ్రి రాథోడ్ రమేష్ ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు

శ్యామల	: డబుల్ ఇస్మార్ట్
సూర్యమినీ	: ఏలియన్
సూర్యప్యాలెస్	: డిమోంటీ కాలనీ-2
స్వామి	: డిమోంటీ కాలనీ-2
అశోక	: ఆయ్
శివజ్యోతి	: మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం
అనుశ్రీ	: కమిటీ కుర్రోళ్లు
రాజా	: మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం
రంభ	: ఇంద్ర
ఊర్వశి	: తంగలాన్
మేనక	: రేవు, స్త్రీ-2
కుమారి	: ఏలియన్, పరాక్రమం
అప్సర	: మిస్టర్ బచ్చన్
నామవరం	
వీఎస్ మహల్	: మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం, ఆయ్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: ఆయ్
కడియం	
వెంకటసూర్య	: తంగలాన్, ఆయ్